# ధర్మో రక్షతి రక్షితః

**శ్రీ జె. చంద్రశేఖర శర్మ**, బీబీపేట.

ఈ చరాచర సృష్టిలో ప్రతిది ఒకానొక ధర్మానికి లోనై విలసిల్లుతున్నది. ఈ స్థితిలో మానవ జీవిత పరమార్థం ఏమిటి? ఏ మార్గంలో వ్యక్తికి, సమాజానికి శ్రేయస్సు కల్గుతుంది. ఇవి మనపూర్వులకు ఎదురైన ప్రశ్నలు. ఇందుకై వారు ప్రకృతి తత్త్వాన్ని, పరమేశ్వర తత్త్వాన్ని, మానవ దేహతత్త్వాన్ని, సమాజ తత్త్వాన్ని చివరకు దివ్యత్వాన్ని పరిశోధించారు. వీనిలో అన్నింటా అంతర్భూతంగా వారికి ధర్మము దృగ్గోచరమైనది. అట్టి ధర్మ స్వరూపాన్ని వివరించుటకు పూనుకోగా వేదములతో పాటు పురాణేతి హాసములు మహాకావ్యములు సృజియించబడినవి. వీనిలో ధర్మం అన్న శబ్దం అతి విస్తృతమైన భావనతో చర్చించినారు. ఫలితంగా దానికి సరితూగ గల శబ్దం మరి యే ఇతర భాష లేదు. సదాచారము, సంప్ర దాయము, మత విశ్వాసము సార్వజనిక న్యాయం, స్వధర్మము, ఆదర్శము, చట్టము మున్నగు అర్థాలు ధర్మ శబ్దానికున్నవి. స్థూలంగా చెప్పాలంటే ధర్మము మొదటి పురుషార్థము. ''ధారణా ధ్ధర్మః'' అను వ్యుత్పత్తిని బట్టి లోకమును ధరించునదే ధర్మమని'' గ్రహింప వలెను.

లౌకిక జీవితంలో సుఖశాంతులను అనుభవించాలన్నా, పారలవుకిక ఔన్నత్యం సాధించాలన్నా ముందు మానవుడు ధర్మ బద్ధమైన జీవితం అనుభవించవలసి వుంటుంది. ఇందుకై సామాన్య మానవుడు నిత్య జీవితంలో అనుసరించదగిన పంచ యజ్ఞములను మన ఋషులు ప్రతిపాదించి ఉన్నారు. అవి దేవ, ఋషి, పితృ, మానవ, భూత అను పంచ యజ్ఞములు. ఇందు దేవయజ్ఞం అనగా సంపద, సద్బుద్ధి, సంతానం, ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రసాదించిన భగవంతునికి కృతజ్ఞత వెలిబుచ్చుకొనుటకు చేసే త్రికాల సంధ్యా వందనము వంటి సత్కర్మలు.

ఇందు ''ఋషియజ్ఞం'' అనగా మానవ జీవితంలో సుఖశాంతులు విలసిల్లుటకు అనాదిగా ఋషులు ప్రబోధించిన మార్గాన్ని, సందేశాన్ని అధ్యయనం చేసి, దానిని నిత్య జీవితంలో ఆచరించుటకు ప్రయత్నించటం. ఇందు ''పితృయజ్ఞం'' అనగా జన్మనిచ్చిన తల్లి తండ్రు లకు సేవ చేయటం, ఇందు ''మానవ యజ్ఞం''అనగా సాటిమానవుల అభ్యున్న తికి శక్తికొలది పాటుబడుట, ఇందు ''భూత యజ్ఞం'' అనగా మన చుట్టూ విస్తరించబడిన పశు పక్ష్యాదులపట్ల కరుణ కలిగి ఉండడమే కాక ఆహారం పెట్టడం లేదా తన చేతనైన సహాయం అందించడం వంటివి. నిజానికి ప్రతి మానవుడు వీనిని జీవితాదర్శములుగా భావించినప్పుడు సామాజిక జీవనం నేడు మనం చూస్తున్నంత సంఘర్షణతో నిండి వుండదు కదా! ఇది కానప్పుడు మానవుడు తృష్ణాజీవిగానే మిగిలి పోతాడు. దాని ఫలితం దుఃఖమే కదా!

మానవజాతి దుఃఖ విముక్తి అష్టాంగ మార్గాన్ని ప్రబోధించాడు గౌతమబుద్ధుడు. మానవ జాతి తరించుటకు నిత్య జీవితంలో ఆచరించమన్నాడు. అవి సమ్యక్ దృష్టి, సమ్యాక్ ఆలోచన, సమ్యక్ వాక్కు, సమ్యక్ క్రియ, సమ్యక్ జీవనం, సమ్యక్ శ్రమ, సమ్యక్ నిశ్చయము, సమ్యక్ ధ్యానము, అను అష్టాంగ మార్గాలు.

ఇందు ప్రతి దానిలో ''సమ్యక్'' అని వాడాడు. అనగా ''మంచి'' అని అర్థం.

ప్రతి పదములో ప్రతి ఒక్కరూ తమ స్థానంలో మంచి చేయ గల్గితే స్వర్గమన్నది ఎక్కడోలేదు. అది భూతలంలో మానవుడు ప్రయత్న పూర్వకంగా సృష్టించుకో వచ్చునన్నది గౌతముని ఆలోచనామృత సారాంశము.

మన భారతీయ సంస్కృతికి ఎనలేని సేవ చేసిన వేదవ్యాసమహర్షి మానవజాతికి అంతిమంగా ''పరోపకార పుణ్యాయ, పాపం పరపీడనాయ'' – ఇతరులకు ఉపకారం చేస్తే పుణ్యం, అపకారం చేస్తే పాపం అనే సందేశాన్ని ఇచ్చాడు.

'ధర్మోరక్షతి రక్షితః' ఎవరు ధర్మాన్ని రక్షిస్తారో వారిని అది రక్షిస్తుంది. ఎవరు ధర్మాన్ని చంపుతారో వారిని అది చంపుతుంది.

యదా యదాహిధర్మస్య
గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య
తదాత్మానం సృజామ్యహమ్
పరిత్రాణాయ సాధూనాం
వినాశాయ చ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే.

(ధర్మమునకు హాని కలిగి అధర్మము పై కొన్నప్పుడు దుష్ట శిక్షణ, శిష్టరక్షణకై ధర్మమును స్థాపించుటకై తానవతరింతునని శ్రీకృష్ణ భగవానుడు ''గీత'' లో నుడివెను). కనుక కలియుగ ప్రజలు సత్యమును పాటించుట, పెద్దలను గౌరవించుట, పరోపకార మొనర్చుట, ప్రాణుల ఎడ దయ జూపుట, శీలమును కల్గియుండుట మున్నగు ధర్మములను ఆచరించాలి.